క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళ వారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీతాల పెంపు హర్షణీయం

దాబాగార్డెన్స్: రాష్ట్రంలోని మున్సిపల్ శాఖలో నాన్ పబ్లిక్ హెల్త్ ఆప్కోస్ విధానంలో పని చేస్తున్న కేటగిరీ 1, 2, 3 ఉద్యోగుల జీతాలు పెంచుతూ జీవో 124ను ప్రభుత్వం జారీ చేయడం హర్షణీయమని జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వీవీ వామనరావు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగండి



మాట్లాడుతున్న సీఐ వెంకటరావు

సీతంపేట: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలని ఫోర్త్‌టౌన్ సీఐ వెంకటరావు అన్నారు. మంగళవారం అక్కయ్యపాలెం ఎన్జీఓస్ కాలనీలోని జీవీఎంసీ హైస్కూల్‌ను తన సిబ్బందితో కలిసి సందర్శించిన ఆయన, ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని, సెల్‌ఫోన్‌లో గేమ్స్, రీల్స్‌తో కాలక్షేపం చేస్తూ చదువును నిర్లక్ష్యం చేయవద్దని హితవు పలికారు. సమయపాలన పాటిస్తూ, ప్రతిరోజూ క్రమం తప్పకుండా స్కూల్‌కు హాజరై టీచర్లు చెప్పిన పాఠాలు శ్రద్ధగా వినాలని, పాఠ్యాంశాలలోని సందేహాలు వెంటనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. క్రమశిక్షణతో చదువుతూ మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల హెచ్‌ఎం జయంతి రాధా కుమారి మాట్లాడుతూ విద్యార్థులు మంచి నడవడికతో పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు రత్నం, జ్యోతి, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం.ఎస్.వి. విశ్వనాథం, ఉపాధ్యాయులు సునీత, గ్లోరీ, హైమ, నిర్మల, కిశోర్, అప్పారావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



మాంగళ్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు


సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి సహస్రనామార్చన ఘనంగా జరిపారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి 1001 నామాలతో స్వామికి సహస్రనామార్చన జరిపి, ఉభయదాతలకు స్వామివారి తులసి ప్రసాదం, శేషవస్త్రం అందించారు.

శ్రావణమాస వేడుకలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

దాబాగార్డెన్స్: ఈ నెల 25 నుంచి కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న వేడుకల ఆహ్వాన పత్రికను ఆలయ ఈవో కె.శోభారాణి మంగళవారం స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి పూజలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనే దృష్ట్యా ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వేదపండితుడు వెంకటేశ్వర ఘనాపాటి పాల్గొన్నారు.

దక్షిణానికి శ్రావణ శోభ

- 25 నుంచి కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణమాసం పూజలు
- స్వర్ణాభరణ అలంకరణలో దర్శనమివ్వనున్న సిరులతల్లి
- అమ్మవారి దర్శనానికి తరలి రానున్న భక్తులు
- వచ్చే నెల 8న వరలక్ష్మీ వ్రతం.. 9న శ్రావణ పౌర్ణిమ పూజలు



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు



తులసిపూజలో సిరులతల్లి



కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద భక్తుల సందడి (ఫైల్)

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 25 నుంచి వచ్చే నెల 23 వరకు శ్రావణమాసాన్ని పురస్కరించుకుని శ్రావణ లక్ష్మీ ప్రత్యేక కుంకుమ పూజలు జరపనున్నారు. నెల రోజులూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, అలాగే గురు, శుక్రవారాల్లో 2 విడతలుగా ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, 9.30 నుంచి 10.30 గంటల వరకు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. ప్రత్యేక పూజలో సంకల్పం, లక్ష్మీ సహస్రనామాలు, లక్ష్మీ హోమం, అమ్మవారి దర్శనం, వేద ఆశీర్వచనం చేపట్టనున్నారు. పూజలో పాల్గొన్న భక్తులకు అవసరమైన పూజా సామగ్రిని దేవస్థానమే సమకూరుస్తుంది. విశిష్ట సామూహిక కుంకుమ పూజలో పాల్గొనదలిచే భక్తులు(దంపతులు) రూ.400 టికెట్ రుసుం చెల్లించాలి. పూజ అనంతరం భక్తులకు శేషవస్త్రంగా కండువా, జాకెట్టు ముక్క, పావుకేజీ పులిహోర, పావుకేజీ చక్కెర పొంగలి, శ్రీచక్రయంత్రం(రాగి) మహాప్రసాదంగా అందజేస్తారు.

25న ప్రారంభం..

స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆ రోజు ఉదయం 8.20 గంటలకు జ్యోతి ప్రజ్వలన చేసి శ్రావణలక్ష్మి పూజలు ప్రారంభించనున్నారు. శ్రావణలక్ష్మీ ప్రత్యేక కుంకుమ పూజలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షములకు పాత్రులు కావాలని ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు తెలిపారు. స్థానికేతరులు ఎవరైనా పూజలో పాల్గొనలేకపోతే వారి గోత్రనామాలతో పూజ చేసి లక్ష్మీ యంత్రం, కుంకుమ, ప్రసాదం పోస్టల్ ద్వారా ఇంటి చిరునామాకు పంపనున్నట్టు ఈవో పేర్కొన్నారు.

పూజా రుసుం ఎలా చెల్లించాలి.. : పూజా రుసుం రూ.400 చెల్లించాల్సిన అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్‌లో చెల్లించాలి. మరిన్ని వివరాలకు 0891-2568645, 2566515, 2731250 నంబర్లలో సంప్రదించవచ్చు.

శ్రావణమాసం.. పండగ పర్వదినాలు..

శ్రావణమాసంలో వచ్చే మూడో శుక్రవారం (ఆగస్టు 8) వరలక్ష్మీవ్రతం, 9న శ్రావణ పౌర్ణమి రోజున ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అలాగే శ్రావణ మాసంలో వచ్చే ఐదు శుక్రవారాలు (ఈ నెల 25, ఆగస్టు 1, 8, 15, 23) ప్రత్యేక పూజలు జరపనున్నారు.



స్వర్ణాభరణ అలంకరణలో సిరులతల్లి



రజత వస్త్రాలంకరణలో కన్యకాపరమేశ్వరి

విశేష అలంకరణలో కన్యకాపరమేశ్వరి..

శ్రావణమాసం సందర్భంగా పాతనగరంలోని కురుపాం మార్కెట్ సమీపాన వేంచేసిన కన్యకాపరమేశ్వరి ఆలయంలో నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమ పూజలు, మహిళలచే సామూహిక లలితా సహస్రనామ పారాయణ, అమ్మవారి మూలవిరాట్‌కు పాత్ర:కాల ప్రత్యేకాభిషేకాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తొలి శుక్రవారం (ఈ నెల 25న) అమ్మవారిని ముత్యాలచీరలో అలంకరించనున్నారు. రెండో శుక్రవారం(ఆగస్టు 1) సువర్ణ వస్త్రాలంకరణ, మూడో శుక్రవారం (ఆగస్టు 8) పట్టు వస్త్రాలంకరణ, నాల్గో శుక్రవారం రజిత వస్త్రాలంకరణ, ఐదో శుక్రవారం అమ్మవారిని శ్రీలక్ష్మీదేవి రూపంలో అలంకరించనున్నారు.

ఘనంగా రాచపోలమాంబ మారువారం వేడుక



అమ్మవారి తిరువీధి ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

అల్లిపురం: భక్తుల కొంగుబంగారం రాచపోలమాంబ అమ్మవారి మారువారం వేడుక మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుమ్మరి వీధిలో గల అమ్మవారి పుట్టింటి నుంచి అమ్మవారి తిరువీధి ఉత్సవం వైభవంగా చేపట్టారు. తప్పెట గుళ్ల, తోడపెద్దు, గరిడి సేవలతో కుమ్మరివీధి, అల్లిపురం మెయిన్‌రోడ్డు, మార్కెట్ రోడ్డు మీదుగా నేరెళ్లకోనేరు జంక్షన్, గోకుల్ థియేటర్ దరి రాచపోలమాంబ అమ్మవారి దేవాలయం, మెయిన్‌రోడ్డు సతకం పట్టు వరకు తిరువీధి కొనసాగింది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

ఎస్సీ సెల్ సమావేశాలకు వాసుపల్లికి ఆహ్వానం



వాసుపల్లిని ఆహ్వానిస్తున్న ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు పూర్ణచంద్రరావు

బీచ్‌రోడ్డు: త్వరలో జరగబోయే వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా స్థాయి సమావేశాలకు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్‌ను ఆ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పూర్ణ చంద్రరావు ఆహ్వానించారు. ఈ మేరకు మంగళవారం ఆయనను కలిసి ఆహ్వానం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన్ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, పూడి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కేసుల రాజీ దిశగా న్యాయవాదులు కృషి చేయాలి



మాట్లాడుతున్న న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

విశాఖ లీగల్: న్యాయస్థానాల్లో అపరిష్కృతంగా ఉన్న కేసులను మధ్యవర్తిత్వంతో రాజీ చేసే దిశగా న్యాయవాదులు సేవలు అందించాలని విశాఖ న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. మంగళవారం సాయంత్రం జిల్లా కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ భవనంలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ప్రధాన ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు నిబద్ధతతో కేసులు తగ్గించే విధంగా సేవలందించాలని అన్నారు. కేసుల రాజీ విషయంలో ఇరు వర్గాలకు తగిన విధంగా అవగాహన కల్పించాలన్నారు. న్యాయవాదులు కేవలం దిగువ కోర్టుల తీర్పులతో పాటు ఉన్నత న్యాయస్థానాల తీర్పులను కూడా విశ్లేషించాలని కోరారు. కార్యక్రమంలో మధ్యవర్తిత్వంలో శిక్షణ పొందిన న్యాయవాదులు, న్యాయమూర్తులు, సమాంతర న్యాయ సేవ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాడబలిజలకు ప్రాధాన్యం ఇవ్వాలి

ఏపీ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ డిమాండ్



మాట్లాడుతున్న ఏపీ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అల్లిపురం: కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల భర్తీలో వాడబలిజ కులస్తులకు ప్రాధాన్యం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మైలపల్లి లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఫిషింగ్ హార్బర్‌లో గల కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గత ప్రభుత్వం ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని వాడబలిజలకు కేటాయించిందన్నారు. కూటమి ప్రభుత్వం అగ్నికుల క్షత్రియులకు కేటాయించడం సరికాదన్నారు. మత్స్యకారులలో 14 ఉపకులాలు ఉన్నాయని, తూర్పుగోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాల్లో వాడ బలిజలు 31 శాతం మంది ఉన్నారని, జనాభా ప్రాతిపదికన చూసినట్లయితే నామినేటెడ్ పోస్టుల భర్తీలో సముచిత ప్రాధాన్యత కల్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ముఖ్యమంత్రి ఈ విషయంలో చొరవ తీసుకుని అన్ని అర్హతలు కలిగిన అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పీసీ అప్పారావుకు నామినేటెడ్ పోస్టుల భర్తీలో సముచిత స్థానం కల్పించాలని కోరారు. అసోసియేషన్ అధ్యక్షుడు బర్రి కొండబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల భర్తీలో వాడబలిజలకు అగ్రతాంబూలం ఇవ్వగా ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టడం దురదృష్టకరమన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురపతి నర్సింగరావు, జి.పరశురాముడు, మున్నం బాలాజీ, జి.కామేశ్వరరావు, ఎం.ఆనంద్, ఆర్.సత్యనారాయణ, జి.రాజు తదితరులు పాల్గొన్నారు.

పోరాటయోధుడు దాశరథి



మాట్లాడుతున్న సాహితీ విశ్లేషకుడు డాక్టర్ డీవీ సూర్యారావు

సీతంపేట: తెలంగాణ ఉద్యమ కవి, దివంగత దాశరథి కృష్ణమాచార్య శత జయంత్యుత్సవ సభ ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మంగళవారం ఘనంగా జరిగింది. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు, విశ్లేషకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అరసం జిల్లా అధ్యక్షుడు ఉప్పల అప్పలరాజు సభాధ్యక్షత వహించారు. గత ఏడాది ఆంధ్రవిశ్వవిద్యాలయంలో జరిగిన దాశరథి ఉత్సవాలను గుర్తుచేసుకుంటూ తెలంగాణ కవి అయినప్పటికీ దాశరథి తెలుగు తల్లిని ప్రస్తావించిన వైనాన్ని కొనియాడారు. ప్రముఖ సాహితీ విశ్లేషకులు డాక్టర్ డీవీ సూర్యారావు దాశరథి ఉద్యమ సాహిత్యంపై లోతైన విశ్లేషణ చేశారు. 'ఆ చల్లని సముద్ర గర్భం' పద్యంతో ప్రారంభించి, దాశరథి రచనలన్నింటినీ స్పృశించారు. 'దాశరథి ఒక శాంతి విప్లవం. జైల్లో ఉండి కూడా కవిత్వం మరువని మహోన్నత సాహితీవేత్త' అని ప్రశంసించారు. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అన్న దాశరథి ప్రఖ్యాత వాక్యాన్ని సోదాహరణంగా వివరించారు. రైతుల గురించి దాశరథి కవిత్వాన్ని వివరిస్తూ, ఆయన 'దిగిపో' అని గర్జించిన ధైర్యశాలి అని, తిమిరంతో సమరం చేసిన మహాకవి అని విశ్లేషించారు. ప్రఖ్యాత వ్యాఖ్యాత రాంభట్ల నృశింహశర్మ దాశరథి రాసిన చలన చిత్ర గీతాలపై మాట్లాడారు. 'ఆ రజనీకర బింబం' పాటతో తన ప్రసంగాన్ని ప్రారంభించి, 'గరళము నుంచి సరళమునకు సాహిత్యాన్ని దించిన కవి దాశరథి' అని అభివర్ణించారు. దాశరథి సినీ గీత రచనను సభకు పరిచయం చేశారు. అరసం ఉపాధ్యక్షుడు ఎస్. హనుమంతరావు మాట్లాడుతూ దాశరథి కవిత్వంలో మానవతా కేతనం ఎగురుతుందని గుర్తుచేశారు. కవి బసు పోతన సభా ప్రారంభంలో స్వాగతోపన్యాసం చేశారు. కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు పాల్గొని దాశరథి కృష్ణమాచార్య సాహిత్యం, ఆయన సేవలను స్మరించుకున్నారు.

దొంగతనానికి పాల్పడిన యువకుడి అరెస్ట్

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ క్రైమ్ పోలీసు స్టేషన్ పరిధిలోని మద్దిలపాలెం ఆర్టీసీ డిపో పార్శిల్ కౌంటర్ వద్ద దొంగతనానికి పాల్పడిన కట్టమ్మరెడ్డి విజయకుమార్ (22)ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ వివరాలను ద్వారకా క్రైమ్ ఎస్ఐ చక్రధర్‌రావు తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం... చిటికిల చెల్లంనాయుడు మద్దిలపాలెం ఆర్టీసీ డిపో పార్శిల్ కౌంటర్ వద్ద కళాసీగా పని చేస్తున్నాడు. 19వ తేదీ రాత్రి కౌంటర్‌లో నిద్రపోగా ఉదయం లేచి చూసేసరికి అతని సెల్‌ఫోన్, రూ.19,300 నగదుతో పాటు మరో కళాసీ ఫోన్ కనిపించ లేదు. దీంతో సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తి వారు నిద్రిస్తున్న సమయంలో దొంగతనం చేసినట్లు గుర్తించారు. దీంతో ఎంవీపీ నేరవిభాగం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు సీసీటీవీ ఫుటేజీను పరిశీలించారు. అనంతరం దర్యాప్తు ప్రారంభించగా కేఆర్‌ఎం కాలనీ సమీపంలో కట్టమ్మరెడ్డి విజయ్‌కుమార్ అనుమానాస్పదంగా సెల్ ఫోన్ అమ్మడానికి ప్రయత్నిస్తుండగా ఎస్ఐ రవికుమార్ బృందం అతన్ని పట్టుకొని అరెస్ట్ చేసింది. అతని వద్ద నుంచి ఫోన్‌తోపాటు రూ.17,300 నగదు స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్యశ్రీని అటకెక్కించారు

- జగనన్న రాజ్యం రావాలి.. పేదల కష్టాలు పోవాలి
- మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల వైద్యం శూన్యమైందని, ఆరోగ్యశ్రీని అటకెక్కించారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ దుయ్యబట్టారు. జీవీఎంసీ 31వ వార్డులో ఆ వార్డు పార్టీ అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్ ఆధ్వర్యంలో మంగళవారం కృష్ణాగార్డెన్స్‌లో బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. పాల్గొన్న వాసుపల్లి కూటమి ఏడాది పాలన మోసాలపై ప్లకార్డులు ప్రదర్శించి స్థానికులకు అవగాహన కల్పించారు. కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. ఆరోగ్యశ్రీ లేదు.. ఆరోగ్య ఆసరా లేదని ఎద్దేవా చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అనేక సంక్షేమ పథకాలు పేద బడుగు, బలహీన వర్గాలకు అందేవని, చంటి పిల్లాడి నుంచి వృద్ధుల వరకు సంక్షేమ పథకాలు ఎటువంటి అవినీతి జరగకుండా సక్రమంగా అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మత్స్యకారులంటే పేదవారని, వారిలో చాలా మందికి కరెంట్ బిల్లును బూచిగా చూపించి పెన్షన్లు రాకుండా కూటమి ప్రభుత్వం చేసిందని మండిపడ్డారు. మహిళలకు ఉచిత బస్సు వస్తుందని, తిరుపతి వెళ్దామని చాలా మంది మహిళలు మొక్కుకున్నారని.. ఈ రోజుకీ ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి రాలేదని ఎద్దేవా చేశారు. 50 ఏళ్లకే పెన్షన్, భర్త చనిపోయిన మహిళలకు పింఛన్‌ను కూటమి ప్రభుత్వం నీరుగార్చిందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి.. సంక్షేమం పూర్తిగా కుంటుపడిందన్నారు. నారా లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగాన్ని నడిపిస్తూ వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న నాయకులపై అక్రమ కేసులు బనాయించడం సరి కాదన్నారు. ఎన్ని కక్షపూరిత రాజకీయాలు చేసినా, జగనన్న రాజ్యాన్ని తీసుకొచ్చి, మళ్లీ పేదల ఇళ్లల్లో పండగ వాతావరణం తీసుకురావడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. పార్టీ నూతన ఒరవడితో బలోపేతం అవుతుందన్నారు.

పార్టీ క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ, జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి రామానంద్, బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్, వార్డు నాయకులు పెంటకోట నాగరాజు, గంట శ్రీనివాస్, రాము మాస్టార్, బాబూరావు, కర్రి ధనలక్ష్మి, దుర్గా, రమాదేవి, పల్లా శ్రీనివాస్, శేఖర్, మోహన్, విజయ్, త్రినాథ్, ఒమ్మి చిన్నారావు, కాండ్రేగుల రాజు, పార్టీ నాయకులు పచ్చిరపల్లి రాము, మహ్మద్ షరీఫ్, లండా రమణ, రెయ్యి డేవిడ్ రాజు, దసమంతుల చిన్ని, బద్దిబోయిన అప్పారావు, వడ్డాది దిలీప్, కోన శంకర్, దూడ అప్పారావు, ఆరుగుల రాజు, సుధా, యాసీన్, కొణతాల కృష్ణవేణి, ఆకుల శ్యామ్, రవితేజ, పలు వార్డుల అధ్యక్షులు దశమంతుల మాణిక్యాలరావు, నీలాపు సర్వేశ్వరరెడ్డి, ముత్తాబత్తుల రమేష్, మహ్మద్ షకీల్, రాజారెడ్డి, ముజీబ్‌ఖాన్, భీశెట్టి ప్రసాద్, నియోజకవర్గ నాయకులు కోరాడ సురేష్, సూరాడ లక్ష్మణ్, బుల్లెట్ రవి, గాలి పార్వతి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన మధుర గీతాలాపన



గీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

సీతంపేట: ఎంవీఆర్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నిర్వహించిన 'స్వర రాగ గంగా ప్రవాహమే' సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ గాయనీ గాయకులు ఆపాత మధురగీతాలను ఆలపించి శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. గాయనీ గాయకులు పెమ్మరాజు రామ్, నూకల ప్రభాకర్, గంటి ఉష, సి.వి.రాజేశ్వరి, భాగ్యలక్ష్మి, అంబిక, శ్రీనివాస్, ప్రభాకర్, రామనరసింహం, నాగేశ్వరరావు ఆలపించిన పాటలు ఆహూతులను ఉర్రూతలూగించాయి.

పతకాలు కొల్లగొట్టిన స్విమ్మర్లు



విజేతలను సత్కరిస్తున్న వైశాఖి స్పోర్ట్స్ పార్కు ప్రతినిధులు

మురళీనగర్: విశాఖ బీచ్ రోడ్‌లోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ విభాగంలో బాల బాలికలకు నిర్వహించిన ఆక్వాటిక్ స్విమ్మింగ్ పోటీల్లో మురళీనగర్ స్విమ్మర్లు పతకాల పంట పండించారు. వీరు విశేష ప్రతిభ చూపి రెండు బంగారు, మూడు రజిత, రెండు కాంస్య పతాలకు సాధించారు. వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్రీడాకారులను సత్కరించారు. స్విమ్మింగ్ పూల్ విభాగంలో గ్రూప్-2 లో పాల్గొన్న ప్రియేష్ నాయుడు 50 మీటర్లు, 100 మీటర్లు బ్రెస్ట్ స్ట్రోక్‌లో బంగారు పతకాలు, 200మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్ లో రజిత పతకం సాధించగా గ్రూప్-3 లో బండి సౌరవ్ 100మీటర్లు ఫ్రీ స్టైల్, 100 మీటర్లు బ్రెస్ట్ స్ట్రోక్‌లో రజిత పతకాలు, 200 మీటర్లు ఫ్రీ స్టైల్‌లో కాంస్య పతకం సాధించారు. సనపల ప్రేమ్ కుమార్ గ్రూప్-2 లో 100మీటర్లు ఫ్రీ స్టైల్‌లో కాంస్య పతకం సాధించారు. కార్యక్రమంలో పార్కు ఉపాధ్యక్షుడు ఎస్.సత్యనారాయణ, సహాయ కార్యదర్శి కనకరాజు, కోశాధికారి ఎం.రామకృష్ణ , కార్యవర్గ సభ్యులు ఎల్‌వీ సుధాకర్, టీఎస్ఎన్ రాజు, ఆర్.నాగేశ్వరరావు, వీర రాఘవయ్య పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతం



కంచరపాలెం పాత ఐటీఐలో ప్రాక్టికల్ పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు

కంచరపాలెం: స్థానిక ఐటీఐ జంక్షన్ వద్ద ఉన్న పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఐటీఐ)లో 2025 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో వివిధ ట్రేడ్‌లకు నిర్వహించిన ఆల్ ఇండియా ట్రేడ్ టెస్ట్ (ఏఐటీటీ) ప్రాక్టికల్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. జూలై 17న ప్రారంభమైన ఈ పరీక్షలు ఎటువంటి అవాంతరాలు లేకుండా విజయవంతంగా పూర్తయ్యాయని ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ డి.వేంకటేశ్వరరావు తెలిపారు. ఈ పరీక్షలను రీజినల్ డైరెక్టర్ ఆఫ్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ (ఆర్డీఏటీ) నియమించిన ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి శ్రీకాంత్, డిపార్ట్‌మెంటల్ విజిలెన్స్ స్క్వాడ్ అధికారి సాల్మన్, జోన్-1 రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ (ఆర్డీడీ) అధికారి ఆర్.వి. రమణ పర్యవేక్షించారు. పరీక్షల్లో ఎటువంటి అవకతవకలు, మాల్‌ప్రాక్టీస్‌కు తావులేకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.